క్లుప్తంగా

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన



మల్లునాయుడుపాలెంలోని బాణసంచా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రామచంద్రరావు, తహసీల్దార్ చిన్నికృష్ణ తదితరులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి, గంగవరం, మల్లునాయుడుపాలెం గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలను తహసీల్దార్ బి. చిన్నకృష్ణ, సీఐ రామచంద్రరావు సోమవారం తనిఖీ చేశారు. బాణసంచా తయారీ కేంద్రాలను నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. బాణసంచా తయారీకి అనుకూల వాతావరణం ఉందా లేదా అని పరిశీలించి తగు సూచనలు చేశారు. లైసెన్స్‌లు లేకుండా తయారీ కేంద్రాలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్మిక అధికారి పి. సూర్యనారాయణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరయ్య తదితరులు ఉన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణం అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, రఘునాథ్ ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో స్వామికి అర్చన నిర్వహించారు.ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

పీజీఆర్ఎస్‌కు 4 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ శంకరరావు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 4 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ (ఇన్‌చార్జి) శంకరరావు వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఎస్ ఉద్యోగులకు సత్కారం



సత్కారం అందుకుంటున్న వీఆర్ఎస్ ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పొందుతున్న ఉద్యోగులను సోమవారం ఘనంగా సత్కరించారు. విభాగం కాన్ఫరెన్స్ హాలులో డీజీఎం తంగేటి శేషాచలాచారి, అములోజు శ్రీనివాసరావు, లక్కోజు శ్రీనివాస మూర్తిలను సత్కరించారు. కార్యక్రమంలో డీజీఎం దేవులపల్లి బ్రహ్మ, ముసినాడ శ్రీనివాసు, ఎం.అనిల్, అర్జునాచారి, ఈ. రవీంద్ర, పి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాతో.. వాణిజ్య సముదాయం!

- ప్రభుత్వ భూమి కలుపుకొని మరీ అక్రమ నిర్మాణం
- కూటమి ముఖ్య నాయకుల అండతో రెండు వారాల్లో గొడౌన్ పూర్తి
- స్థానికుల ఫిర్యాదుతో తీవ్రంగా స్పందించిన హైకోర్టు
- సమగ్ర విచారణ చేపట్టాలని పెందుర్తి తహసీల్దార్‌కు ఆదేశం
- తక్షణమే గొడౌన్‌కు విద్యుత్ సదుపాయం నిలిపేయాలని ఆ శాఖకు లేఖ



చినముషిడివాడ సర్వే నంబర్ 109/2లో వివాదాస్పద స్థలంలో ఇంటి పట్టాతో నిర్మించిన కమర్షియల్ గొడౌన్

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడలో ఓ బీజేపీ కార్పొరేటర్ సోదరుడి కబ్జా కాండపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ కార్పొరేటర్ ముమ్మన దేముడు సోదరుడు దాలినాయుడు నిర్మించిన గొడౌన్‌పై సమగ్ర విచారణ చేపట్టి నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు సూచించింది. దీంతో స్పందించిన పెందుర్తి తహసీల్దార్ ఐ.వెంకట అప్పారావు సదరు గొడౌన్‌కు తక్షణమే విద్యుత్ సదుపాయం నిలుపుదల చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు లేఖ రాశారు. కాగా చినముషిడివాడ సర్వే నంబర్ 109/2లో బీజేపీ కార్పొరేటర్ కుటుంబ సభ్యులకు ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేసిన పట్టాతో ఏకంగా భారీ



గొడౌన్‌కు తక్షణమే విద్యుత్ సదుపాయం నిలిపేయాలని విద్యుత్ శాఖ అధికారులకు పెందుర్తి తహసీల్దార్ పంపిన లేఖ

వాణిజ్య సముదాయాన్ని నిర్మించడం స్థానికంగా సంచలనం రేపింది. దాదాపు రెండు దశాబ్దాలుగా వివాదం నడుస్తున్న భూమిలో కేవలం రెండు వారాల్లో వాణిజ్య సముదాయం నిర్మించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మరోవైపు ఈ గొడౌన్ నిర్మాణంలో కొంత



తొలగింపును అడ్డుకుంటున్న బీజేపీ కార్పొరేటర్ సోదరుడు (ఫైల్)



సర్వే నంబర్ 109/2లో వివాదాస్పద స్థలంలో ఈ నెల 4న తొలి దశ నిర్మాణం పూర్తయిన గొడౌన్

వరకు ప్రభుత్వ భూమి కూడా ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో పాటు సదరు బీజేపీ కార్పొరేటర్ సోదరుడి కట్టడంలోని జిరాయితీ భూమిలో సైతం వేరే హక్కుదారుడు ఉన్నట్లు దాదాపు నిర్ధారణ అయింది. ఈ వివాదంపై తాజాగా హైకోర్టు పై తీర్పు వెలువరించింది.

రెవెన్యూ అధికారులను బెదిరించి నిర్మాణం..

ఈ వివాదాస్పద స్థలంలో ఈ నెల 4న నిర్మాణం చేపట్టిన దాలినాయుడు శరవేగంగా పూర్తి చేశారు. అప్పట్లో ఈ గొడౌన్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులను తీవ్రస్థాయిలో బెదిరించినట్లు సమాచారం. మండల తహసీల్దార్ సైతం ఈ నిర్మాణాన్ని ఆపాలని నోటీసులు ఇచ్చినా బేఖాతరు చేస్తూ కేవలం రెండు వారాల్లో గొడౌన్ పూర్తి చేసి దాన్ని అద్దెకు సైతం ఇచ్చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం అందులో వ్యాపార కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయి. అయితే తాజాగా హైకోర్టు తీర్పు ప్రకారం ఏం జరుగుతుందో వేచి చూడాలి.

అసలేం జరిగింది?

చినముషిడివాడ సర్వే నంబర్ 109లో 17.54 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో ఎస్సీబీసీ కాలనీలతో పాటు ద్రోణంరాజు నగర్ నిర్మాణం జరిగింది. మరోవైపు ఇదే సర్వే నంబర్ 109/2లో పోలీసులకు గృహావసరాలకు స్థలం కూడా కేటాయించారు. దీంతో పాటు 83 సెంట్ల గెడ్డ పోరంబోకు భూమి ఉంది. జనావాసాలు పోగా ఆయా సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమి దాదాపు రెండెకరాలు ఓ కుటుంబం కబ్జాలో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో కూడా గతంలో చాలా నిర్మాణాలు జరిగిపోయాయి. కాగా మిగిలిన స్థలంలో 95వ వార్డు బీజేపీ కార్పొరేటర్ సోదరుడు దాలినాయుడు తమ తల్లి సింహాచలమ్మ పేరుతో వచ్చిన ఇంటి పట్టాను అడ్డం పెట్టుకుని భారీ వాణిజ్య సముదాయం (నిబంధనల ప్రకారం ఇంటి పట్టా వాణిజ్య భవన నిర్మాణానికి చెల్లుబాటు కాదు) నిర్మించారు. ఈ నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వంలోని జీవీఎంసీ కీలక ప్రజాప్రతినిధి చొరవతో జీవీఎంసీ ప్లాన్ కూడా ఇచ్చింది. ఆక్రమిత భూమిపై చర్యలు తీసుకోకుండా మరో కూటమి నేత రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వినిపించాయి.

విద్యుత్ సదుపాయం నిలుపుదల చేయాలని లేఖ రాశాం..



చినముషిడివాడ సర్వే నంబర్ 109లో జరిగిన నిర్మాణానికి హైకోర్టు ఆదేశాల మేరకు విద్యుత్ సదుపాయం నిలుపుదల చేయాలని ఆ శాఖకు లేఖ రాశాం. కోర్టు ఇచ్చిన గడువులోగా సమగ్ర సర్వే చేసి నివేదిక ఇస్తాం. ప్రభుత్వ స్థలం కూడా ఇందులో కలిసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పూర్తిస్థాయి విచారణ చేసి కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఐ.వెంకట అప్పారావు, తహసీల్దార్ పెందుర్తి

కార్యకర్తలకు వెన్నుదన్నుగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను గుర్తించిన పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి కార్యకర్తలకు మనోధైర్యాన్ని కల్పించడానికి డిజిటల్ బుక్‌ను ప్రారంభించారని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పరవాడ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గాల పరిశీలకులు పైల శ్రీనివాసరావు, ఇతర నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ కార్యకర్తలకు అనేక విధాలుగా తోడ్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరు డిజిటల్ బుక్‌లో వారిపై జరిగిన దాడులు, అన్యాయాలను నమోదు చేసుకుంటే మన ప్రభుత్వం వచ్చిన తర్వాత దాడులకు గురైన వారికి తగిన విధమైన న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యకర్తలపై జరిగిన దాడులు, అక్రమ అరెస్టులను కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగంతో నడిపించడం దుర్మార్గమన్నారు. ప్రస్తుత కూటమి పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను డిజిటల్ బుక్‌లో భద్రపర్చడానికి డిజిటల్ బుక్ అనేక విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించడానికే పార్టీ అధినేత ఈ డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు, పెదిశెట్టి శేఖర్, బొద్దపు చిన్నారావు, పైల సత్యనారాయణ, కావలి రాజు, పల్లా గోవింద్, పూర్ణానందశర్మ, శేషు, సురేష్, సూరాడ మసేను తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పోషణకు ప్రాధాన్యత ఇవ్వాలి



గర్భిణులకు శ్రీమంతం జరిపిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు

పరవాడ: బిడ్డల పోషణ, గర్భవతులు, బాలింతలైన భార్యల సంరక్షణలో భర్తలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమంలో భాగంగా పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ స్థూలకాయానికి కారణమైన ఉప్పు, పంచదార, నూనె వాడకాన్ని, క్యాన్సర్ కారకమైన ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరు తగ్గించాలని ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు సూచించారు. గర్భవతులకు శ్రీమంతాలు, ఏడో నెల బిడ్డలకు అన్నప్రాసన జరిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుగిడి రామగోవిందరావు, వియ్యపు చిన్న, ఎంపీడీవో రమేష్‌నాయుడు, ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, సూపర్‌వైజర్ శ్యామలకుమారి, హెచ్‌వీ రమణి, పి.లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న సురేష్ తదితరులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పారిశుధ్య కార్మికులకు సోమవారం మర్రిపాలెం వుడా లేఅవుట్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కమ్యూనిటీ హాలులో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ సురేష్, కార్యవర్గ సభ్యులు దుస్తులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె. రవి, ఎస్ రంగారావు, కోశాధికారి కనకారావు, సభ్యులు సత్యనారాయణ సతీష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంపునకు సహకరించండి



ఉక్కు భద్రతా విభాగం జీఎంను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఉక్కునగరం: భద్రతతో కూడిన ఉత్పత్తి పెంపునకు సహకరించాలని ఉక్కు భద్రతా విభాగం జనరల్ మేనేజర్ ఎస్. రవి కోరారు. ఉక్కు భద్రతా విభాగాధిపతిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య తదితరులు ఆయన్ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం రవి మాట్లాడుతూ మానవ వనరులు సురక్షితంగా ఉండడం భద్రతా విభాగం ప్రాధాన్యత అన్నారు. అధిక ఉత్పత్తి సాధించడం ఉద్యోగుల లక్ష్యమన్నారు. ఈ రెండింటిని మేళవించి ఉత్పత్తి సాధిస్తే ఆ సంస్థ ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. కార్యక్రమంలో విభాగం డీజీఎం వరప్రసాదరావు, అధికారులు మోహనరావు, టిర్కీ, సాయి ప్రసాద్, నాయకులు ఎస్. మోహన్‌బాబు, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా పూజలందుకున్న దుర్గమ్మ



మహా సరస్వతిగా దర్శనమిస్తున్న దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారు



సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన ఎస్ఆర్ పురం కనకదుర్గమ్మ



సుజాతానగర్‌లోని అయ్యప్పదేవాలయంలో సరస్వతీదేవిగా కనకదుర్గమ్మ



మొగలిపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న గండి రవికుమార్ తదితరులు



దేవీపురంలో సామూహిక అక్షరాభ్యాసాలలో పాల్గొన్న చిన్నారులు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉమాదేవి అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిరాట్‌ని సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చిఅమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే పుస్తక పూజ వైభవంగా నిర్వహించారు. పలువు చిన్నారులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు చేశారు.

మొగలిపురంలో..

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో శ్రీవీరాంజనేయస్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి అమ్మవారి నిలుపుదల కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పార్టీ నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు బోను గంగునాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, యడ్ల నాయుడు, గండి ముత్యాల నాయుడు, వార్డు మెంబర్లు గండి నాయుడు, బత్తిన వెంకట్, గండి కన్నంనాయుడు, దేముడు నాయుడు, చెల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహా సరస్వతిగా సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి..

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి దేవి సోమవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. గురూజీ ఆశ్రమంలో వారి గురుమాత నిష్ఠల అన్నపూర్ణమ్మ సామూహిక మంత్రదీక్ష ఇచ్చారు. అనంతరం సామూహిక వాగ్దేవి హోమం నిర్వహించారు. సుమారు 60 మంది బాలికలను బాలాత్రిపుర సుందరిగా భావించి శ్రీయంత్ర మహామేరులో ఆశీనులను చేసి షోడశోపచార పూజలు జరిపించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన వీణా కచేరీ ఆకట్టుకుంది.

సరస్వతీ నమోస్తుతి..

పెందుర్తి: స్థానికంగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు అమ్మవార్ల దేవాలయాల్లో ఎనిమిదో రోజు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- చినముషిడివాడ పంచముఖ గాయిత్రీ మాత ఆలయంలో భారీఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. సరస్వతీ పూజ, సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో భారీ ఎత్తున కుంకుమ పూజలు చేశారు.
- పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి విశేష అర్చనలు నిర్వహించారు.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భవానీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.
- సుజాతానగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మను సరస్వతిదేవిగా అలంకరించి సామూహిక అక్షరభ్యాసాలు, సరస్వతి పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులకు అక్షరభ్యాసాలు చేశారు.




శ్రమశక్తినగర్‌లో సరస్వతీదేవిగా పంచముఖ గాయిత్రీదేవి



పెందుర్తి మహాకామేశ్వరీ ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



సప్తగిరినగర్‌లో విద్యాలక్ష్మిగా అలివేలు మంగమ్మ



పెందుర్తి అయ్యప్పస్వామి దేవాలయంలో సరస్వతిగా అమ్మవారు

సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని పాదయాత్ర



40వ వార్డులో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

సింధియా: పెదగంట్యాడలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టవద్దని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో 40వ వార్డు ఏకేసీకాలనీలో ఆ పార్టీ నాయకులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే వాయు కాలుష్యం ఏర్పడి శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధుల బారిన పడి ప్రజలు ఆస్పత్రి పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీలో కేవలం 250 మందికి మాత్రమే ఉపాధి కలుగుతుందని, కానీ 10 లక్షల మంది ప్రజల అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. జోన్ నాయకులు కె.పెంటారావు మాట్లాడుతూ ప్రజలను అనారోగ్యానికి గురి చేసే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 8న జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా పాల్గొని వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సత్యారావు, పీవీ భాస్కరరావు, జి.నరేష్, ఎం.కోటి, సురేష్, తాత, బుజ్జి, నేలయ్య, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.